# వి. ఆర్. కళాశాల :: నెల్లూరు

# మేనకూరు ఆదిశేషారెడ్డి జనరల్ లైబ్రరీ & రీడింగ్ హాల్

## ప్రారంభోత్సవం :: 25.10.98 సా|| 6.00 గంటలకు



ఆనం వివేకానందరెడ్డి

ప్రారంభకులు

**ప్రొఫెసర్ కె. ఇనాక్**, పిహెచ్.డి.
వైస్‌ఛాన్సలర్
ఎస్.వి. యూనివర్సిటీ, తిరుపతి

అధ్యక్షులు

**శ్రీమతి వై. శ్రీలక్ష్మి**, ఐ.ఏ.ఎస్.
జిల్లా కలెక్టర్ మరియు మేజిస్ట్రేట్

ముఖ్యఅతిధులు

**శ్రీ ఆనం రామనారాయణరెడ్డి**,
బి.కాం.,బి.ఎల్.,
మాజీ మంత్రివర్యులు

**శ్రీ యం. గోపీకృష్ణ**, ఐ.పి.ఎస్.
యస్.పి., విజిలెన్స్, నెల్లూరు

**ప్రొఫెసర్ పి. మురళి**, పిహెచ్.డి.
రెక్టార్, ఎస్.వి. యూనివర్సిటీ, తిరుపతి

**ప్రొఫెసర్ పి. మోహన్**, పిహెచ్.డి.
రిజిస్ట్రార్, ఎస్.వి. యూనివర్సిటీ
తిరుపతి

### ప్రియ విద్యార్థులకు విజ్ఞప్తి!

"పుస్తకాలే నిజమైన స్నేహితులని ఆర్యోక్తి", నేటి విద్యావిధానంలో విద్యార్థులు ఎంతో పోటీని ఎదుర్కోవలసి వస్తున్నది. కాలానుగుణంగా విద్యార్థులు తమ పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా మరెన్నో విషయాలను గ్రహించడం అత్యవసరం. "శ్రద్ధావాన్ లభతేజ్ఞానం" అన్నట్లు విద్యార్థులు జ్ఞాన భాండాగారమైన గ్రంథాలయాన్ని తమ జ్ఞానాన్ని వృద్ధిపరచుకోడానికి, పదును పెట్టుకోడానికి, అమూల్యమైన విషయాలను చదివి ఆకళింపు చేసుకోడానికి ఒక సాధనంగా ఎంచుకోవాలి. తీరిక సమయాన్ని వృధా చేయకుండా కళాశాల గ్రంథాలయానికి వెళ్ళి ఎంతో అమూల్యమైన సమాచారాన్ని అంశాలను విద్యార్థులు సమకూర్చుకొని పరిపక్వమైన విద్యార్థులుగా రూపొందాలని ఆకాంక్షతో ఎన్నో వ్యయప్రయాసలకోర్చి 25.10.98 తేది సాయంత్రం వి.ఆర్. కళాశాల ఆవరణలో శ్రీ మేనకూరు ఆదిశేషారెడ్డి జనరల్ లైబ్రరీ & రీడింగ్ హాల్‌ను ప్రారంభించడం జరుగుతున్నది. ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకొంటారని ఆకాంక్షిస్తూ...

మీ శ్రేయోభిలాషి...

**ఆనం వివేకానందరెడ్డి**, బి.ఎ.,
సెక్రటరీ మరియు కరస్పాండెంట్
వి.ఆర్. కాలేజి మరియు హైస్కూల్ కమిటీ

పై ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసినదిగా కోరుతూ...

**డి. గోపాలకృష్ణమూర్తి**, పిహెచ్.డి.
ప్రిన్సిపాల్, వి.ఆర్. కళాశాల, నెల్లూరు

# నెల్లూరు ముచ్చట్లు

విశ్లేషకుడు

## చంద్రబాబు

ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు 30 తేది ఉదయం ఆకాశమార్గాన యంత్ర విహంగం (హెలికాప్టర్) ఎక్కి నెల్లూరు వేంచేస్తున్నారు. నెల్లూరు, సర్వేపల్లి, ఆత్మకూరు నియోజక వర్గాలలో కార్యక్రమాలుంటాయి - ఇంకా ఖరారు కాలేదు. అధికారులతో సమీక్షా సమావేశం; ఎమ్మెల్యేలతో రాజకీయ ఇష్టాగోష్టి సమాలోచనలు వుంటాయి. కొందరు ముఖ్య కార్యకర్తలు చెప్పే సంగతులూ వింటారట.

## అశోక్ గజపతి

రాష్ట్ర ఆర్థిక మంత్రి శ్రీ అశోక్ గజపతి రాజు 24 తేది నెల్లూరు వస్తున్నారు. తడ, నేలపట్టు, లేగుంటపాడులు సందర్శిస్తారు. ఆ రాత్రికి నెల్లూరులో తిరుగు రైలెక్కుతారు.

## ఢిల్లీకి నెలవల

మాజీ తిరుపతి పార్లమెంట్ సభ్యుడు శ్రీ నెలవల సుబ్రహ్మణ్యం ఢిల్లీ శాసన సభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ పరిశీలకుడిగా నియమితుడైనాడు. దక్షిణ ఢిల్లీకి ఆయన ఇన్‌ఛార్జి.

ఎమ్పీ అయిన మోజు ఏ కొంచమైనా తీరకముందే చింతా మోహన్ టక్కెట్ ఎగరేసుకొని పోవడం వల్ల మాజీ అయిపోయిన దురదృష్టవంతుడు సుబ్రహ్మణ్యం. రాజకీయాలను నమ్ముకొని దివ్యమైన బ్యాంకు నౌకరీ కాలదన్నుకున్నాడు; ఇప్పుడు అదీ పోయింది, ఇదీ పూడింది. అప్పుడప్పుడు ఇటువంటి పార్ట్‌టైం పనులైనా లేకుంటే పిచ్చి పట్టిపోదూ పాపం!

## గూడూరు రోడ్డు- దుర్గాప్రసాద్ వివరణ

గూడూరు టౌన్‌లో ఎమ్మెల్యే దుర్గాప్రసాద్ కాంట్రాక్టు తీసుకొని వేయించిన రోడ్డు ఒక్క వానకే గుంటలు పడిపోయిందని గతవారం జమీన్‌రైతులో వచ్చిన వార్త నిజం కాదని ఆయన వివరణ ఇచ్చాడు. "బస్టాండు ప్రాంతంలో బావుల వంటి గుంటలు ఏర్పడి వుండడం చూసి నేను రిపేరు చేయించిన మాట నిజమే. అయితే అది మీరు వ్రాసినట్లు రోడ్డు కాదు; నేను చేసింది కాంట్రాక్టు పనికాదు. కలెక్టర్ గారు మెటల్, గ్రావల్ తోలిస్తే, కొందరు తెలుగు దేశం కార్యకర్తలను ప్రోత్సహించి వాటితో గుంటలు పూడ్పించాను. నేను తట్టతో మట్టి మోశాను. అంతకు మించి నేనే బిల్లూ తీసుకోలేదు. కేవలం శ్రమదానం మాత్రమే చేశాం. మట్టితో పూడ్చిన గుంటలు కాబట్టి, వానకు కొట్టుకపోయి గుంటలు బయట పడ్డాయి; అంతే" - అని చెప్పారు దుర్గాప్రసాద్ గారు!

## ఎమ్పీలంటే అలుసా?

నెల్లూరు జిప స్టాండింగ్ కమిటీ నియామకాలలో పార్లమెంట్ సభ్యులను అవమానించారన్న అభిప్రాయం ఏర్పడుతూంది. నెల్లూరు, తిరుపతి, ఒంగోలు ఎమ్పీలు నెల్లూరు జిపలో సభ్యులు; ముగ్గురూ కాంగ్రెస్ వారులే. జిప మాత్రం తెలుగు వీరుల కబంధ హస్తాలలో వుంది. తమ ఘనతను చాటుకోవడానికన్నట్లు అంతగా ప్రాధాన్యత లేని వ్యవసాయ స్థాయీ సంఘంలో వీరిని ఇరికించి; ఆర్థిక వంటి కీలక సంఘాలను తమ తెలుగు దేశం సభ్యులతో నింపుకున్నారు. దీన్ని నిరసిస్తూ కాంగ్రెస్ జిప సభ్యులు మొన్నటి సమావేశం నుంచి వాకౌట్ చేశారు.

జిపకు శ్రీమతి కొసల్యమ్మ పేరుకే ఛైర్మన్; పెత్తనం మొత్తం మంత్రి చంద్రమోహన్‌ది! పేరుకు పెత్తనం అన్నట్లు... అన్న సామెతను నిజం చేస్తున్నారాయన. జిప స్థాయీ సంఘాలు నామమాత్రపు కమిటీలు. అందులో సభ్యత లేనంత మాత్రాన ఎమ్పీల కిరీటాలేవీ రాలిపడవు - మంత్రి బుద్ధి బయటపడింది, అంతే!

## వి.ఆర్ కాలేజి లైబ్రరీ

వి.ఆర్ కాలేజిలో లైబ్రరీ కోసం ఒక భూరి భవనం నిర్మించారు - శ్రీ ఆనం వివేకానంద రెడ్డి. టౌన్‌హాల్‌గా ప్రసిద్ధమైన గదిని రెండంతస్తుల డూప్లెక్స్ భవనంగా మార్చి లైబ్రరీని దానిలోకి తరలించారు. వి.ఆర్ కాలేజికి దాదాపు 30 సంవత్సరాలు సెక్రటరీగా వుండిన శ్రీ మేనకూరు ఆదిశేషారెడ్డి పేరు పెట్టారు దీనికి; అన్నేళ్లు ఆ భూరి సంస్థకు పెత్తనం వహించినా చిన్నమాట అన్పించుకోని పెద్దమనిషి ఆదిశేషారెడ్డి గారు; ఆయన పేరు పెట్టడం మంచి పని! వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె. ఇనాక్ ఈ భవనానికి రిబ్బను కత్తిరించబోతున్నారు - 25 తేది!

## పెన్నా నీళ్లు

పెన్నలో ప్రవాహం తగ్గింది. పై నుంచి నీళ్లు రావడం లేదు.

## పొగతోటలో దొంగలు

నెల్లూరు టౌన్‌లో రద్దీ సెంటర్ పొగతోటలోని మూడు హాళ్ల ప్రక్కన, ఎప్పుడూ మనుషులు తిరిగే ఈ ప్రాంతంలో ఈ మధ్య దొంగతనాలు జరుగుతున్నాయి. ఇక్కడి సత్యప్రియ నర్సింగ్ హోమ్‌లో 22తేది రాత్రి దూరిన దొంగలు అక్కడ డబ్బేమీ దొరకక పోవడంతో కొన్ని పరికరాలను దొంగిలించారు. ఆ తరువాత మానసిక వైద్య నిపుణులు డాక్టర్ డి. సత్యనారాయణ, శ్రీసాయి సత్య హాస్పిటల్‌కి వెళ్లి గందరగోళం సృష్టించి, అక్కడ కూడా డబ్బేమీ దొరకక పోవడంతో వెనుకకు తిరిగి వెళ్లారు. హాస్పిటళ్లు వుండే ప్రాంతాల్లో దొంగల భయం మొదలైతే ఎలా? నైటు బీటు తిరుగుతున్న కానిస్టేబిళ్లు ఎంత వరకు డ్యూటీ చేస్తున్నారన్నది సంస్కరణల ఎస్పీ ఒకసారి స్వయంగా తిరిగి చూస్తే బాగుంటుంది.

## శాస్త్రీయ సాహిత్యోపన్యాసాలు

నెల్లూరు జాషువా కవితా పీఠం 25, 26 తేదుల్లో టౌన్‌హాల్లో శాస్త్రీయ, సాహిత్యోపన్యాసాలు ఏర్పాటు చేసింది. 25తేది హేతువాదుల సంఘం అధ్యక్షుడు రావిపూడి వెంకటాద్రి, 26తేది డాక్టర్ కరిమద్దెల నరసింహారెడ్డి ఉపన్యసిస్తారు.*




**జమీన్‌రైతు చందా**

| | | |
|---|---|---|
| సంవత్సర చందా | రూ. | 100లు |
| ఆరునెలలకు | రూ. | 50లు |
| విడిప్రతి | రూ. | 2లు |

అక్రమ అవినీతి ధనార్జన వల్ల సుఖము, సంతోషము ఎండమావి లాంటి బ్రతుకులు, ఈనాటి వాతావరణ పరిస్థితులలో కూడా భగవంతుని ఉనికిని తెలుపుతున్నాయి. మన వేద ధర్మాన్ని నవీన నాగరికతతో మేళవించి కాపాడుకోవాల్సిన బాధ్యత అందరి మీద ఉన్నది.

జయతు జయతు సంస్కృతం,
జయతు జయతు భారతం

... గునుపాటి వేణుగోపాల్

